తరువాత నాకు సుశీల వుత్తరంరాస్తూ, "మీ మగ వాళ్లు నిజంగా పరమ నీచులు. ఐనా, కామరాజుగారి ఋణం తీర్చుకున్నానని తృప్తిగా వుంది" అని రాసింది.

---

# 'ఫాలౌట్'

బస్తీనుండివచ్చిన బావమరిదిని వెంట పెట్టుకొని రాయన్న వంగతోటకు వెళ్ళాడు. బావమరిది వనమయ్యఏదో పత్రికకు రిపోర్టరుగా పనిచేస్తున్నాడు.

("ఏరా, పోర్టరు పెద్దగేడా. రిపోర్టరు పెద్దగేడా! అని రామన్న వనమయ్య ఛలోక్తి విసిరినప్పుడు వాళ్ళ పల్లెటూరివాళ్ళు మందహాసం చేసేవాళ్ళు.)

వనమయ్య శెలవుమీద వున్నాడు. అతను కావటానికి చిన్నరిపోర్టరే అయినా పెద్ద ఆలోచనలు గలవాడు. అతనికి ఒకటేచింత! అమెరికాలో పుట్టకపోతినే అని.

ఇదే అమెరికను రిపోర్టరయితే శలవులు పూరికేపోని స్తాడా! బోలెడంత "పిండి" పోగుచేసి ఒక పుస్తకంరాసి యిరవై వేల డాలర్లకు అమ్మేసేవని!

అసలు అమెరికను రిపోర్టరు శలవులు బావగారి వంగతోట చూడబోతాడా! షేమ్!

ఆవును బీడుమధ్య ఒకగుంజకు పొడుగుపాటి పలుపుతో కట్టేస్తారు. అది యెంత మేర మేసేది ఆ పలుపు పొడుగే నిర్ణయిస్తుంది.

వనమయ్య శలవుల్లో "మేత"కు ఎంతదూరం వెళ్లేదీ వనమయ్య జీతమే నిర్ణయించింది... ఇంకా ఆవు నయం; అది గుంజకు అన్ని దిక్కులా స్వేచ్ఛగా తిరిగి మేస్తుంది. వనమయ్య ఒక్క దిక్కుగానే పోగలడు. మరి హెచ్చుదూరం వెళ్ళాడంటే పలుపు తెగుతుంది. వెనక్కు తిరిగిరావటానికి "తైలం" వుండదు.

పల్లెటూరు గనుక చేద్దామన్నా ఖర్చువుండదనీ, బావ మరిది వూరుగనుక తనకు అన్నీ జరిగిపోతాయనీ వనమయ్య యిక్కడికి వచ్చాడన్నమాట.

తెల్లవారు గట్టగానే మంచువాసన కొడుతున్నది. యే నాడూ పత్రికలు చదివి, రాజకీయాలు చర్చించని వంగ మొక్కలు అశాంతి అన్నది యెరగకుండా జీవితాన్ని తమ లోని ప్రతిరంధ్రంతోనూ ఆస్వాదిస్తున్నాయి.

"ఈ ప్రాంతంలో ఒక్క హైడ్రోజను బాంబు పేలితే!" అనుకున్నాడు వనమయ్య.

వెంటనే అతనికి తన మనసులో మొలిచిన ప్రశ్న మూడు కాలముల డబుల్ లైనుగా మనోనేత్రముందు ప్రత్యక్షమయింది.

"ప్రాంతంలో ఒక్క హైడ్రోజన్ బాంబు పేలితే—"

దానికింద "ఒక విలేఖరిభావన" అని చిన్న అక్షరాలతో కనిపించింది. సహజంగా వనమయ్య తనపేరు దాచుకుంటాడు.

పుస్తకం కాకపోతే పోయింది, ఒక వ్యాసం—వ్యాస పరంపర అయితే మరీ బాగుండదూ ?

"ఈ ప్రాంతంలో "శిక్షకను" "ఒక హైడ్రోజన్ బాంబు పేలితే" "ఒక మహానగరం యేర్పాటైతే" ఒక సహకార వ్యవసాయ క్షేత్రం యేర్పాటుచేస్తే యిలాగ వ్యాసపరంపర రాయవచ్చు. కొంచెం ఆలోచిస్తే అయిదారు వ్యాసాలు తట్టుతాయి. అన్నీ కలిపి అచ్చేస్తే అదే పుస్తకం.

ముఖ్యమైన విషయమేమిటంటే వ్యాసాలలో గ్రామీణుల జీవితమూ, మనస్తత్వాలూ చక్కగా ప్రతిబింబించాలి.

వనమయ్యకు గ్రామంలోవుండే మామూలు రైతులూ, పాలేర్లూ, యితర కులవృత్తులు చేసుకునేవారూ వ్యక్తిత్వ రహితుల్లాగే కనపడేవాళ్ళు, వాళ్ళనుగురించి తెలుసుకునేటందు కేమీ లేదు.

ఆ వూళ్ళో చెప్పుకోదగినవాళ్లు ఐదారుగురే వున్నారు. బాగా ధనికుడూ, ఇరవై యేళ్ళక్రితం యువకుడూ అయిన భుజంగం వున్నాడు. అతను ఒకప్పుడు జస్టిస్ పార్టీ, తరువాత రాయిస్టు, ప్రస్తుతం ఫోరమిస్టు. కాని, మొదటనుంచి కడదాకా మాంచి కమ్యూనిస్టు వ్యతిరేకిస్టు. ఊళ్ళో అందరికన్నా అతని రాజకీయగొంతు బలిష్టమైనది. స్థానిక కాంగ్రెస్‌వాది తిలక్, గాంధీ సిద్ధాంతాలు చర్చించేవాడుకాదు. "కాంగ్రెస్ పదవిలోకి వచ్చినాక ప్రజలకు రాజకీయాలతో యేం పని ? పరాయివాళ్ళు పరిపాలిస్తుంటే నూటికిఅయిదుగురుకూడా రాజకీయాలు మాట్లాడేవారుకారు ప్రజాప్రభుత్వాలు వచ్చినాక

నూటికి తొంభైమంది రాజకీయాలు మాట్లాడేవాళ్ళే! ఎందుకంట ?" అనేవాడు తిలక్‌గాంధీ.

"నువ్వుచెప్పేది ఆ అయిదుగురుకూడా రాజకీయాలకు తిలోదకా లివ్వాలనేనా ?" అని అడిగేవాడు స్టాలిన్ లెనిన్, ఆ వూరి కమ్యూనిస్టునాయకుడు.

సాధారణంగా స్టాలిన్ లెనిన్ మాట్లాడితే యెవరూ వినిపించుకునేవారు కాదు. సంవత్సరానికి 364 రోజులు తన వూళ్ళో అటువంటి మనిషే లేనట్టు నటించి, ఒక్కరోజున అతనుతప్ప వూళ్ళో యింకొకవిషయమే లేనట్టుగా మాట్లాడుకునేవాళ్ళు ఆ వూరివాళ్ళు......

వంగతోట మధ్యగా బావమరుదులు నడుస్తున్నారు, రాయన్న ముందూ, వనమయ్య వెనకా.

"బావా !" అన్నాడు వనమయ్య అకస్మాత్తుగా ఆగి.

"ఒరే, ఆపాటికూడా తెలియదట్రా ? ఎక్కడనాన్నా బావా అనుగాని వంగతోటదగ్గిర—" అంటూ రాయన్న తన పల్లెటూరి "విట్" విసిరాడు.

ఐతే వనమయ్యకు రాయన్నమాటలు వినబడినట్టులేదు. అతను వంగి ఒక వంగమొక్కను పెద్దకళ్ళతో తదేకంగా చూస్తున్నాడు.

"ఏమిట్రా అది?" అన్నాడు రాయన్న, బస్తీవాళ్ళు పనికిమాలిన వాటికన్నిటికీ ప్రాముఖ్యం యిస్తారన్నభావం స్ఫురించే గొంతుతో.

"ఈ ఆకుమీద ఏమిటి?" అన్నాడు వనమయ్య కొంచెంగా వణుకుతున్న గొంతుతో.

"ఆకుమీద ఏమి వుంటుందిరా! ఏదన్నా మట్టో, తెగులో, గుడ్డో అయివుంటుంద" అన్నాడు రాయన్న.

"కాదు' వచ్చిచూడు, నీకే తెలుస్తుంది" అన్నాడు వనమయ్య.

'నా మొహం' అని మనసులోనే అనుకుని రాయన్న దగ్గిరికి వెళ్ళి చూశాడు, కాని ఆయనకేమీ వింత కనిపించ లేదు.

"ఏదో బూడిదలాగుంది" అన్నాడాయన.

"సరిగా చూడు. మామూలుబూడిద యెక్కడన్నా అట్లా వుంటుందా!" అన్నాడు వనమయ్య.

"ఏడిసినట్టుంది: బూడిదలో మామూలు బూడిదా, అమామూలు బూడిదా వుంటుందా ఏమిటి?" అన్నాడు రాయన్న.

"ఇదేనా నీకు తెలిసింది; ఇది అమామూలు బూడిదే నన్నడిగితే 'ఫాలౌట్?" అన్నాడు వనమయ్య.

"ఏం లౌటూ!" అంటూ రాయన్న ఆ బూడిదను వేలితో తాకబోయాడు. వనమయ్య ఆయనను రెక్కపట్టుక గుంజాడు. ఇద్దరూ కింద పడ్డారు.

"ఏమిట్రా నువ్వు?" అని రాయన్న విసుక్కుంటూ లేచాడు.

"అది తాకావంటే యెముకలన్నీ పుచ్చిపోతాయి. రక్తం విరుగుతుంది. జపానులో అయిదు లక్షలమంది యీ బూడిదసోకే చచ్చారు. ఒక పడవలో చేపలుపట్టేవాళ్ళమీద యీ ఫాలౌట్ పడితే—

రాయన్నకు యీ పాటికి తన బావమరిదికి మతి పోయిందన్న అనుమానం కలగసాగింది.

"నువ్వు చెప్పేది ఒక్కటీ నేను నమ్మను!" అన్నాడు మొదట.

వనమయ్య పదినిమిషాలు గుక్క తిప్పుకోకుండా మాట్లాడిన తరువాత, "అదీ యిదీ ఒకటి అయివుండదు" అన్నాడు.

"ఇదే యింకో దేశంలో అయితే పొలంఖామందు యే పత్రికకో టెలిఫోన్ చేసేవాడు. వాళ్ళు రిపోర్టర్లను పంపేసే వాళ్ళు. వాళ్ళు వచ్చి ఫొటోలు తీసుకుని ప్రభుత్వానికి పంపే వాళ్ళు. ప్రభుత్వం సైంటిస్టులను పంపేది. సైంటిస్టులు గీగర్ కౌంటర్‌తో వచ్చి, ఇది స్ట్రాంటియం తొంభయ్యో కోబాల్టు అరవయ్యో క్షణంలో తేల్చేసేవాళ్లు! 'అన్నాడు వనమయ్య.

అంతా విని రాయన్న "సరే, యింటికిపోయినాక యేం చెయ్యాలో ఆలోచింతాంలే!" అన్నాడు.

"ఈ మొక్కను గుర్తుపెట్టుకోవాలి. ఈ పొలంలో పని చేసేవాళ్ళతో యీ మొక్కను ముట్టుకోవద్దని చెప్పాలి. ఈ యేటికి యీ వంగతోట కాపు బసులుశా అవతల పారెయ్యాలి సిందే. ఈ వంకాయలు తిన్నవాళ్ళుకూడా ఆ రోగాలతో తీసుకుని చస్తారు. ఏమిటనుకున్నావో!" అన్నాడు వనమయ్య. తన బావగారి అనుమానపు కవచాన్ని ఛేదించటానికి భగీరథ యత్నంచేస్తూ.

"నీ మొహం!" ఈసారి రాయన్న పైకే అనేశాడు.

ఆ సాయంకాలం నలుగురు దేవుడిగుడి దగ్గిర చేరారు.

"అది అణువు బాంబు భస్మమౌనా కాదా అన్నది నిర్ధారణ అయినదాకా మనం యేమీ చెప్పలేం" అన్నాడు తిలక్ గాంధీ. ఆయన నిర్లిప్తత చూస్తే ఆయనకు ఆ బూడిద బాంబు బూడిద కాదను నమ్మకం వున్నట్టుగా కనబడింది.

"అది ఫాలౌట్ అయితే రష్యన్ బాంబు పనే అయి వుంటుంది" అన్నాడు భుజంగరావు.

"ఎందుచేతను ?" అన్నాడు స్టాలిన్ లెనిన్.

"మీ బాంబులు గొప్పవని మీ కృశ్చేవ్ రోజూ చెబుతూనే వున్నాడుగా!" అన్నాడు భుజంగం.

"చెబితే ? అన్నాడు స్టాలిన్ లెనిన్.

"అమెరికావాళ్ళు క్లీన్ బాంబులు చేస్తున్నారు. దాన్నిబట్టి తెలియటంలా ?"

'ఏమిటి తెలిసింది ? మనదేశంలో బాంబులు లేక పోయినా బాంబులమసి మనుషుల తలకాయల్లో మాత్రం చేరింది ?"

మాటమీద మాటవచ్చింది.

"అహింస ! అహింస !" అన్నాడు తిలక్ గాంధీ.

కాని మాటమీద మాట పెరిగింది. జనం గుమి కూడారు. ఒకేసారిగా భుజంగమూ, లెనిన్ స్టాలిను ప్రజలను వుద్బోధించసాగారు.

"మనం బాంబుల భస్మం చూసి భయపడరాదు. కమ్యూనిజం నిర్మూలించటానికి బాంబులమసి ఒకటే మార్గమైతే ప్రతి గ్రామంమీదా మసి పడినప్పటికీ—"

"యుద్ధోన్మాదులు దురహంకారాంవల్ల. పెట్టుబడి దారిని, నిలబెట్టటానికి సామ్రాజ్యవాదులు మానవజాతిని సయితం నిర్మూలించే ప్రయత్నంలో—"

"అసలు మనవూళ్ళో యీ కమ్యూనిష్టుచీడ యేమి టంటాను! ఆమాట నాకు ముందు చెప్పండి!"

"కమ్యూనిస్టు వ్యతిరేకతతో మన కళ్ళు పొరలు కప్పుకుపోయినంతకాలము మనకు అణుబాంబుల భయం వుండనేవున్నది!"

పోట్లాట మొదట్లో ప్రేక్షకుల అంచున ఆరంభ మయింది. తరువాత అది చెయిన్ రియాక్షన్ పద్ధతిలో గుంపు కంతకీ వ్యాపించింది.

ఒకరిద్దరికి తలకాయలు పగిలాయి. ఇద్దరు ముగ్గురికి కాళ్ళూ చేతులూ విరిగాయి.

"ఒరే రాత్రిబండి అందుతుంది. వెంటనే భోజనంచేసి నీవు బయలుదేరు. పెద్దవాణ్ణో చిన్నవాణ్ణో చెబుతున్నా!" అన్నాడు రాయన్న.

ఆదరాబాదరా అన్నంతినటంలో తాను తోట వంకా యలకూర తింటున్నానని వనమయ్య గమనించలేదు. ఆ సంగతి రైల్లో గుర్తుకొచ్చింది. వనమయ్యకు చెమటలుపోశాయి. కాళ్ళూ చేతులూ పీకుతున్నట్టుతోచింది.

పట్నం చేరుతూనే వీధిలోవున్న డాక్టరుగారిదగ్గిరికి వెళ్ళి పరీక్ష చేయించుకున్నాడు. డాక్టరు పాతికరూపాయలు తీసు కుని "ఆమూలాగ్ర పరీక్ష చేసి" ఏమీ జబ్బులేదన్నాడు.

వనమయ్య బిడియపడుతూ తాను ఫాల్ట్ వంకాయి కూర తిన్నట్టు అనుమానంగా వుండన్నాడు.

డాక్టరు నవ్వలేదు.

"అదా? దాని లక్షణాలు మూడునెల్లదాకా బయట పడకపోవచ్చు. ఆరునెల్లతరవాత బయటపడినా పడవచ్చు?" అన్నాడాయన.

ఇదంతా జరిగి యింకా నెలకూడాకాలేదు.

పాపం వనమయ్యగతి యేంకానున్నదో!

# పెళ్లివ్యవహారం

ఇంటకి చేరే సమయానికి సులోచన దడ యింకా సాంతం పోలేదు ఆమె పాదాలూ, మోకాళ్ళూ యింకా బలహీనంగానే వున్నాయి. చేతుల తిమ్మిరలు పోతూ వస్తూ వున్నాయి. తనను చూసి యంతనుంది యేమనుకున్నారో వూహించుకోవటానికికూడా ఆమెకు ధైర్యం చాలలేదు. మొట్టమొదటిసారిగా ఆడది దొంగతనమో వ్యభిచారమో, తాగటమో చేస్తే తనకున్నస్థితే వుంటుందా అని ఆమె ఆశ్చర్యపడింది.

కాని తాను యింతటి వుద్రేకానికి గురికావడం సులోచనను మరింత ఆశ్చర్యపరిచింది. ఎందుకంటే తాను చేసిందల్లా